క్లుప్తంగా

22 నుంచి సాయినాథుని వార్షికోత్సవాలు

కొవ్వూరు: స్థానిక గోష్పాద క్షేత్రంలోని షిర్డీ సాయినాథ్ ఆధ్మాతిక కేంద్రంలో ఈనెల 22 నుంచి 27 వరకూ సుందర సాయినాథ్ 28వ వార్షికోత్సవాన్ని నిర్వహించనున్నారు. 22 ఉదయం సాయి సచ్చరిత పారాయణ,సాయంత్రం ఆధ్మాతిక ప్రవచనాలు నిర్వహి స్తారు. 24 ఉదయం ఎనిమిది గంటల నుంచి సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు 25 ఉదయం గణపతి హోమం, 26న సాయినాథునికి ఏకాదశ రుద్రాభిషేకాలు, 27న సామూహిక విష్ణు సహస్రనామ పారాయణ, సాయినాథునికి తులసీ బిల్వార్చన వ్రతం నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. రోజూ సాయంత్రం పూట ఆధ్మాతిక, సాంస్కృతి కార్యక్రమాలను ప్రదర్శిస్తారని చెప్పారు.

రేపటి నుంచి గౌడీయ మఠంలో భాగవత సప్తాహం

కొవ్వూరు: స్థానిక రామానంద గౌడీయ మఠంలో ఈనెల 26న దామోదర మహరాజ్ విగ్రహ ప్రతిష్ఠ జరుగుతుంది. ఈ నేపథ్యంలో ఈనెల 19 నుంచి 25 వరకూ గౌడీయ మఠం ప్రాంగణంలో భాగవత సప్తాహాన్ని నిర్వహిస్తారు. రోజూ సాధు పుంగవులు, పండితులు ఆధ్యాత్మిక ఉపన్యాసాలు ఇస్తారు. సప్తాహాల్లో భాగంగా గౌడీయ మఠాన్ని విద్యుత్తు కాంతులతో అలంకరించారు.

గోదావరిలో మాజీ ఎంపీ అస్తికల నిమజ్జనం


తండ్రి రెడ్డియ్యకు పిండ ప్రదానం చేస్తున్న మాజీ మంత్రి పార్థసారథి, ఆయన సోదరులు వెంకట సుబ్బారావు, కృష్ణకాంత్ యాదవ్

కొవ్వూరు: కృష్ణా జిల్లా పెనమలూరు ఎమ్మెల్యే, మాజీ మంత్రి కొలుసు పార్థసారథి తండ్రి, మాజీ ఎంపీ కేపీ రెడ్డియ్య యాదవ్ ఈ నెల 13న మృతి చెందారు. ఆయన అస్తికలను పార్థసారథితో పాటు ఆయన సోదరులు వెంకట సుబ్బారావు, కృష్ణకాంత్ యాదవ్‌లు మంగళవారం స్థానిక గోష్పాద క్షేత్రం వద్ద గోదావరి నదిలో నిమజ్జనం చేశారు. వారితో అస్తికలకు పురోహితులు తొలుత ప్రత్యేక పూజలు, అనంతరం పిండ ప్రదానం చేయించారు. అఖిల భారతీయ యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు చవల సూర్య చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

బిహార్ కార్మికుడి ఆత్మహత్య


బిహార్ కార్మికుడు హీరాలాల్

నల్లజర్ల: మండలంలోని అవపాడు గ్రామ శివారులో ఉన్న ఎం.ఎ స్.బయోటెక్‌లో కూలి పనులకు వచ్చిన బిహార్ కార్మికుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బిహార్ రాష్ట్రంలోని అరోరియా జిల్లా మాణిక్‌పూర్ గ్రామానికి చెందిన హీరాలాల్ (35) ఎం.ఎస్. బయోటెక్‌లో కూలి పనికి ఈ నెల 14న వచ్చాడు. 15, 16 తేదీలలో పనిచేశాడు. సోమవారం రాత్రి తోటి కార్మికులు 15మందితో కలసి భోజనం చేశాడు. అనంతరం వారు కర్మాగారం బయట షెడ్డులో నిద్రించారు. మంగళవారం తోటి కార్మికులు చూసేసరికి బాత్రూమ్‌లో హీరాలాల్ దుప్పటి చింపి తాడుగా చేసుకొని ఉరి వేసుకొని మృతిచెంది ఉన్నాడు. కారణాలు తెలియరాలేదు. సీఐ లక్ష్మణరెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఊనగట్లలో ఫ్యామిలీ ఫిజీషియన్

చాగల్లు: గ్రామీణులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకే ప్రభుత్వం ఫ్యామిలీ ఫిజీషియన్ అమలు చేస్తోందని డాక్టర్ దుర్గాప్రసాద్ అన్నారు. తెలిపారు. మండలంలోని ఊనగట్లలో మంగళవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పంచాయతీ సర్పంచ్ మట్టా వెంకట్రావు హాజరయ్యారు. సుమారు 60 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అలాగే గర్భిణులు, బాలింతలు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో 104 వైద్య సిబ్బంది, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎస్‌ఎంలు, ఆశ కార్యకర్తలు, వలంటీర్లు పాల్గొన్నారు.

పేకాడుతున్న నలుగురి అరెస్టు

నిడదవోలు రూరల్: మండలంలోని గోపవరంలో పేకాడుతున్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు సమిశ్రగూడెం ఎస్సై షేక్ సుభానీ మంగళవారం తెలిపారు. గోపవరం శివారులో పేకాడుతున్నారనే సమాచారం అందడంతో పోలీసులు ఈ దాడు జరిపారు. పేకాట ఆడుతున్న వారి వద్ద రూ.7,300 నగదు స్వాధీనం చేసుకున్నామని ఎస్సై చెప్పారు.

రేపటి నుంచి బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ

నిడదవోలు: ఆంధ్రప్రదేశ్ విద్యుత్తు నియంత్రణ మండలి, ఏపీ తూర్పు ప్రాంత విద్యుత్ సంస్థ (ఏపీఈఈపీడీసీఎల్) ఆధ్వర్యంలో 2023-24 ఆర్థిక సంవత్సరానికి గాను ప్రతిపాదించిన వార్షిక ఆదాయ అవసరాలు, రిటైల్ ధరలు, సీఎస్ఎస్‌లపై భహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహిస్తున్నట్లు నిడదవోలు విద్యుత్ ఈఈ బి.వీ రభద్రరావు మంగళవారం తెలిపారు. నిడదవోలు విద్యుత్ కార్యాలయంలో ఈనెల 19 నుంచి 21 వరకూ ఉదయం 10 నుంచి సాయంత్రం 4.30 వరకు ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహిస్తున్నట్లు వీరభద్రరావు తెలిపారు.

చల్లని దీవెనలీయమ్మా..

- ముక్కనుమ సందర్భంగా గ్రామ దేవతలకు ఊరేగింపులు
- గరగ నృత్యాలు, సాంస్కృతిక ప్రదర్శనలతో గ్రామాల్లో సందడి


నిడదవోలు పట్టణంలో నంగాలమ్మ గరగల ప్రదర్శన


తాడిపర్రు గ్రామదేవత గోగులమ్మ జాతరకు గ్రామ ముఖద్వారం వద్ద విద్యుద్దీపాలతో దేవతామూర్తుల అలంకరణ


నల్లజర్ల మండలం ఆవపాడులో ముత్యాలమ్మ వారికి నైవేద్యాలు సమర్పిస్తున్న గ్రామ పెద్దలు

ఉండ్రాజవరం: సంక్రాంతి ప్రధానంగా గ్రామీణులు, రైతులు, వ్యవసాయ అనుబంధ రంగాలతో ముడిపడిన పండగ. ప్రతి పల్లెకూ ఓ గ్రామదేవత కూడా ఉంటుంది. ఆపదల నుంచి, వ్యాధుల నుంచి ఆ దేవత తమను రక్షిస్తుందని ప్రజల ప్రగాఢ విశ్వాసం. గ్రామ దేవతలకు వారిని ఏటా జాతరలు నిర్వహించడం, అవసరమైతే అమ్మవార్లను శాంతింపజేసేందుకు జంతుబలులు ఇవ్వడం అనాదిగా వస్తున్న ఆచారం. సంక్రాంతి ముగింపు సందర్భంగా పలు గ్రామాల్లో ముక్కనుమ నాడైన మంగళవారం అమ్మవార్ల జాతరలను అట్టహాసంగా నిర్వహించారు. ఘనంగా అమ్మవార్ల గ్రామోత్సవాలు నిర్వహించారు. మండలంలోని తాడిపర్రు గ్రామదేవత గోగులమ్మ జాతరను మంగళవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గరగలతో ఆసాదుల నృత్యాలు, వివిధ వేషధారణలు, భేతాళ నృత్యాలు, పలు సాంస్కృతిక ప్రదర్శలతో అమ్మవారి ఊరేగింపు కన్నుల పండువగా సాగింది. ఉదయం వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుంది. దాంతో గ్రామంలో సందడి నెలకొంది. బంధువులు, స్నేహితులు, ఆడ పడుచులతో గ్రామంలో ఇళ్లన్నీ కిటకిటలాడాయి. జాతరకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లూ చేశారు. ఉండ్రాజవరం పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

దేవరపల్లిలో కడియాలమ్మ..

దేవరపల్లి: ముక్కనుమ సందర్భంగా దేవరపల్లి గ్రామదేవత కడియాలమ్మ తల్లిని గ్రామస్తులు పుర వీధుల్లో ఊరేగించారు. ఏటా సంక్రాంతి పండగ మూడోరోజు అమ్మవారిని గ్రామంలో ఇంటింటికీ తీసుకువెళ్లి పూజలు చేస్తారు. గ్రామస్తులు అమ్మవారికి చలివిడి, పానకాలు సమర్పించి పూజలు చేస్తారు. ఉదయం ఎనిమిది గంటల నుంచి రాత్రి వరకూ అమ్మవారి ఘటాలను ఊరేగించారు.

అనంతపల్లిలో దండు గంగాభవాని..

నల్లజర్ల: మండలంలోని అనంతపల్లి గ్రామ దేవత దండు గంగాభవాని అమ్మవారి గ్రామోత్సవం వైభవంగా జరిగింది. ఆలయం వద్ద అమ్మవారిని విశేషంగా అలంకరించారు. గ్రామస్తులు నైవేద్యాలు సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పోకల నాగేశ్వరరావు, వేగి లింగేశ్వర స్వామి ఆలయ కమిటీ చైర్మన్ చిక్కాల నాగేశ్వరరావు, గ్రామపెద్దలు కంతమణి నారాయణ ప్రసాద్, ఉప సర్పంచ్ కలం సత్యనారాయణ, చిట్లా వెంకటేశ్వరరావు, మర్రెడ్డి రాజారావు, కొయ్యాన సత్యనారాయణ, పోకల రామకృష్ణ, బైరెడ్డి శ్రీను, గొర్రెల సాంబశివనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆవపాడులో ముత్యాలమ్మ..

ముక్కనుమ సందర్భంగా ఆవపాడులో గ్రామ దేవత ముత్యాలమ్మ వారి సంబరాన్ని మంగళవారం వైభవంగా నిర్వహించారు. పుట్టింటి వారిగా వ్యవహరిస్తున్న రుద్రా బాలకృష్ణ, వెంకటేశ్వరరావు కుటుంబీకులు, అత్తింటి వారిగా వ్యవహరిస్తున్న అచ్యుత సత్యనారాయణ కుటుంబీకులు అమ్మవారికి పొన్నులు వేసి మేళ తాళాలతో గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామస్తులందరూ అమ్మవారికి పసుపు నీళ్ల ఓరపోసి కొబ్బరి కాయలు కొట్టి, నైవేద్యాలు సమర్పించారు. వైస్ ఎంపీపీ అచ్యుత శివాజీ, కాపు సంఘం అధ్యక్షులు అచ్యుత వీరభద్రం, మద్దూరి విష్ణుమూర్తి, ఆది తాతాజీ, జోగినీడి వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు, మద్దూరి నాగేశ్వరరావు, తోట ధనరాజు, చామన వెంకటసుబ్బారావు, అచ్యుత బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

నిడదవోలులో నంగాలమ్మ..

నిడదవోలు: పట్టణంలోని నంగాలమ్మ వారి పూరిగుడి వద్ద అమ్మవారి గరగోత్సవం వైభవంగా నిర్వహించారు. నంగాలమ్మ తల్లి గరగలను ఎత్తుకుని భక్తులు పట్టణంలో ప్రధాన సెంటర్ల గుండా సాగింది. భక్తులు అమ్మవారి గరగల వద్ద పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులకు, భక్తులు పాల్గొన్నారు.

బకాయిలు చెల్లించాలంటూ కార్మికుల ధర్నా


కొవ్వూరు ఆర్డీవో ఆఫీసు ఎదుట ధర్నా చేస్తున్న అన్నదేవరపేట ఆగ్రో ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ కార్మికులు

కొవ్వూరు: తమ వేతన బకాయిలను చెల్లించాలని కోరుతూ తాళ్లపూడి మండలం అన్నదేవరపేటలోని ఆగ్రో ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ కార్మికులు మంగళవారం కొవ్వూరు ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఐఎఫ్‌టీయూ నాయకుల సారథ్యంలో వారీ ఆందోళన చేశారు. ఈ సందర్భంగా పౌరహక్కుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నంబూరి శ్రీమన్నారాయణ మాట్లాడుతూ 2018 సంవత్సరంలో ఫాక్టరీ యాజమాన్యం కార్మికులకు వేతనాలు బకాయి పడిందన్నారు. వాటిని చెల్లించాలంటూ లేబర్ కోర్టు తీర్పు కూడా ఇచ్చిందన్నారు. అయినప్పటికీ ఇప్పటికీ వేతనాలు చెల్లించకుండా యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఆయన ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం కలగజేసుకుని కార్మికులకు బకాయిలు ఇప్పించాలని కోరారు. అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి చేతుల మీదుగా ప్రారంభించిన ఈ ఫ్యాక్టరీలో పనిచేసిన కార్మికుల ఇబ్బందులను ప్రస్తుత ముఖ్యమంత్రి పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. పౌర హక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు నక్కా వెంకటరత్నం, ఐఎఫ్‌టీయూ నాయకులు కిషోర్, ప్రసాద్, జగన్, రమణ, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్ఎస్ మహర్షి, కార్మికులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

తాళ్లపూడి: మండలంలోని అన్నదేవరపేటలో అల్లూరి విక్రమాదిత్య యూత్, టీడీపీ యువగళం ఆధ్వర్యంలో వాలీబాల్, కబడ్డీ తదితర పోటీలు నిర్వహించారు. విజేతలకు మంగళవారం బహుమతులు అందజేశారు. మూడు రోజుల పాటు ఈ క్రీడా పోటీలు జరిగాయి. వాలీబాల్ టోర్నీలో ప్రథమ స్థానంలో నిలిచిన మలకపల్లి టీమ్‌కు రూ.15 వేలు, రెండో స్థానంలో నిలిచిన బ్రాహ్మణగూడెం టీమ్‌కు రూ.10 వేలు, మూడో స్థానం పొందిన ధర్మవరం టీమ్‌కు రూ.5 వేల నగదు బహుమతులు అందజేశారు. ఈ జట్లకు ప్రైజ్ మనీతో పాటు ట్రోఫీలను అందజేశారు. కార్యక్రమంలో కాకర్ల సత్యేంద్ర, కూచిపూడి గణపతి తదితరులు పాల్గొన్నారు.

తాళ్లపూడి హైస్కూల్లో పూర్వ విద్యార్థుల సందడి


తాళ్లపూడి జెడ్పీ ఉన్నత పాఠశాల 1994-95 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు, వారి గురువులు

తాళ్లపూడి: స్థానిక పరస పద్మ రాజారావు జెడ్పీ ఉన్నత పాఠశాల్లో పూర్వ విద్యార్థులు మంగళవారం సందడి చేశారు. ఈ హైస్కూల్ 1994-95 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం జరిగింది. నాడు పాఠశాల రోజుల్లో తాము గడిపిన మధుర క్షణాలను విద్యార్థులందరూ గుర్తు చేసుకున్నారు. ఎన్నో సంవత్సరాల తర్వాత కలుసుకోవడంతో ఒకరినొకరు ఆలింగనం చేసుకుని, యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. నాటి మిత్రులతో కలిసి రోజంతా ఉల్లాసంగా గడిపారు. ఈ సందర్భంగా వారు తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులు సీహెచ్ ఆంజనేయులు, కందుకూరి సుదర్శన రామకృష్ణ, చేమర్తి విశ్వనాథశర్మ, మూర్తిరాజు, సుబ్బారావు, అర్జునరావు తదితరులను ఘనంగా సత్కరించారు. అప్పటి బ్యాచ్ టాపర్ శ్రీదేవి, అప్పన ప్రవీణ్, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు జేవీ ప్రమోద్ కుమార్‌లను ఘనంగా సత్కరించారు. పరస రాధాకృష్ణ వ్యాఖ్యాతగా వ్యవహరించారు. అనంతరం గ్రూప్ ఫొటో దిగారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కడల కిరణ్, ముళ్ల మల్లిబాబు, మాణిక్యం, సత్యానందం, బాలకృష్ణ, మూర్తి రాజు తదితరులు పాల్గొన్నారు.

వేళ్లచింతలగూడెంలో సంక్రాంతి సంబరాలు


వేళ్లచింతలగూడెంలో సినీ సంగీత విభావరి నిర్వహిస్తున్న గాయనీగాయకులు

గోపాలపురం: గ్రామాల్లో కూడా పండగ కళ తప్పుతున్న ఈ రోజుల్లో ఆర్ అండ్ ఎం ఫౌండేషన్ అసలైన పండగ వాతావరణం చూపించారని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. మండలంలోని వేళ్లచింతలగూడెంలో ఘంటా రంగారావు, మధుకృష్ణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి సంబరాలు సోమవారం రాత్రితో ముగిశాయి. ఈ సందర్భంగా టీవీ కళాకారులైన రవి, శ్యామల యాంకరింగ్, గీతా మాధురి, శ్రావణ భార్గవి, వాగ్దేవి, సాకేత్, అరుణ్, హనుమాన్‌లు తమ మధురమైన గీతాల ఆలాపనతో ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నారు. ఏటా గ్రామంలో సంక్రాంతి సంబరాలు నిర్వహించాలని కమిటీ చైర్మన్ ఘంటా మధుకృష్ణకు ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెంకట్రావు సూచించారు. కొవ్వూరు డీఎస్పీ వీవీఎస్ వర్మ, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ పరిశీలకుడు గన్నమని వెంకటేశ్వరరావు, మద్దిపాటి వెంకటరాజు, కమిటీ సభ్యులు పిన్నమనేని చినబాబు, కొర్లపాటి రాము, దుగ్గిరాల గోపాలకృష్ణ, కొర్లపాటి రాజాచౌదరి తదితరులు పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

- బయటపడ్డ తల్లీ కొడుకులు
- నుజ్జు నుజ్జు అయిన మోటార్ సైకిల్


ప్రమాదంలో లారీ టైర్ల మధ్య ఇరుక్కుపోయిన మోటార్ సైకిల్

కొవ్వూరు: మోటారు సైకిల్‌ను లారీ ఢీకొట్టిన ప్రమాదంలో తాళ్లపూడి మండలం వేగేశ్వరపురం గ్రామానికి చెందిన ఇందుగుల వరలక్ష్మి, ఆమె కుమారుడు మురళీకృష్ణ త్రుటిలో ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. మంగళవారం ఉదయం రాజమహేంద్రవరం వెళ్లేందుకు మోటారు సైకిల్‌పై బయల్దేరారు. కొవ్వూరు పట్టణ శివారులో ఉన్న మినీ బైపాస్‌లో అభాస్య స్కూలు సమీపంలోకి వచ్చేసరికి ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మోటారు సైకిల్‌పై ఉన్న ఇద్దరూ ఓ పక్కకి పడిపోవడంతో స్వల్ప గాయాలతో బయటపడ్డారు. మోటారు సైకిల్ మాత్రం లారీ వెనుక టైర్ల మధ్యలో ఇరుక్కుని నుజ్జు నుజ్జు అయ్యింది. కనీసం మోటారు సైకిల్‌ను బయటి లాగే పరిస్థితి కూడా లేకుండా పోయింది. రెండు టైర్లకు మధ్య భాగంలో ఇరుక్కుని పోయింది. పట్టణ ఎస్సై బి.దుర్గా ప్రసాద్ ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు.

నేత్రపర్వం.. శ్రీగిరీశుని కల్యాణం

- భక్తులతో కిటకిటలాడిన శ్రీపర్వతం
- తిలకించిన వేలాది భక్తులు


శ్రీపర్వతంపై నిర్వహిస్తున్న వేంకటేశ్వరస్వామి వారి కల్యాణం

దేవరపల్లి: మండలంలోని గౌరీపట్నం వద్ద శ్రీపర్వతంపై కొలువైన వేంకటేశ్వరస్వామి వారి కల్యాణం మంగళవారం రాత్రి నేత్ర పర్వంగా జరిగింది. టీటీడీ నుంచి వచ్చిన వేద పడితుల వేదమంత్రాలతో శ్రీవారి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. శ్రీవారిని పెండ్లి కుమారుడిగాను, అమ్మవార్లను పెండ్లి కుమార్తెలు గాను అలంకరించి కల్యాణ వేదిక వద్దకు తీసుకొచ్చారు. రాత్రి ఏడు గంటలకు మంగళ వాయిద్యాలు, అర్చకులు, వేద పండితుల వేద మంత్రోచ్ఛరణల మధ్య శ్రీవారి కల్యాణం ప్రారంభమైంది. దేవస్థానం కమిటీ చైర్మన్ ఎంవీఎస్ ప్రసాద్, గురుదేవులు డాక్టర్ వేదవ్యాస కుమారుడు దత్తాత్రేయ, ప్రధానార్చకుడు అవసరాల వెంకటరామానుజాచార్యులు ఆధ్వర్యంలో టీటీడీ దేవస్థానం వేద పండితులు గోపాలాచార్యులు, రామ్‌కుమారాచార్యులు, ప్రభాకరాచార్యులు, హయగ్రీవాచార్యులు, పలువురు అర్చకులు శ్రీవారి కల్యాణాన్ని వైభవంగా జరిపించారు. కల్యాణ వేడుకను తిలకించి భక్తులు పులకించారు. భక్తులతో శ్రీపర్వతం కిటకిటలాడింది. ఉభయగోదావరి జిల్లాల నుంచి భక్తులు, యోగమిత్రులు కల్యాణాన్ని తిలకించారు.

ముగిసిన శ్రీమన్నారాయణ యజ్ఞం

మకర సంక్రాంతి సందర్భంగా శ్రీపర్వతంపై ఈనెల 12న ప్రారంభమైన శ్రీమన్నారాయణ యజ్ఞం మంగళవారంతో ముగిసింది. ఉదయం 9 గంటలకు పూర్ణాహుతి నిర్వహించారు. శ్రీవారి కల్యాణంతో యజ్ఞ మహోత్సవాలు ముగిశాయి.

ఒక్కో వలంటీర్‌కు ఇద్దరు గృహ సారథులు

- 20 తేదీకి నియామకాలు పూర్తిచేయాలి
- ఎమ్మెల్యే తలారి వెంకట్రావు
- దుద్దుకూరులో వైఎస్సార్ సీపీ సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

దేవరపల్లి: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి అవగాహన కల్పించేందుకు ప్రతి గ్రామ వలంటీరుకు ఇద్దరు గృహ సారథులను నియమిస్తున్నట్టు ఎమ్మెల్యే తలారి వెంకట్రావు తెలిపారు. మండలంలోని దుద్దుకూరు కల్యాణ మండపంలో మంగళవారం రాత్రి నిర్వహించిన వైఎస్సార్ సీపీ కార్యర్తల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. గృహ సారథుల నియామకం ఈ నెల 20 నాటికి పూర్తి చేయాలని సూచించారు. ఇప్పటికే గ్రామ సచివాలయానికి ముగ్గురు చొప్పున కన్వీనర్లు, మండల సచివాలయాల కన్వీనర్ల నియామకం పూర్తి చేశామన్నారు. రాబోయే ఎన్నికల్లో పార్టీ విజయానికి సమన్వయంతో పనిచేయాలని కోరారు. పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కాండ్రు రామకృష్ణ తన జన్మదిన వేడుకలను ఎమ్మెల్యే వెంకట్రావు సమక్షంలో జరుపుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బొంతా నాగమణి, ఎంపీపీ కేవీకే దుర్గారావు, జెడ్పీటీసీ సభ్యురాలు పొట్టి స్వర్ణలత, వైస్ ఎంపీపీ సాదే సుబ్బారావు, గౌరీపట్నం సొసైటీ అధ్యక్షుడు గుత్తికొండ అచ్యుతరావు, ఏఎంసీ డైరెక్టర్ సాలి వేణు , ఎంపీటీసీ సభ్యులు జ్యేష్ట సునీత, విప్పర్తి చంద్ర, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామ సచివాలయాల మండల కన్వీనర్లు వీరే


కల్లేపల్లి మాణిక్యం దేవరపల్లి


నక్కా నాగసత్యనారాయణ(పండు), నల్లజర్ల


తానింకి సత్యనారాయణ (సత్తిబాబు), గోపాలపురం


లక్కాబత్తుల రాజు ద్వారకాతిరుమల

దేవరపల్లి: గోపాలపురం నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో గ్రామ సచివాలయాల మండల కన్వీనర్లను నియమించినట్టు ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ పరిశీలకుడు గన్నమని వెంకటేశ్వరరావు (జీవీ) తెలిపారు. దేవరపల్లిలోని తన క్యాంపు కార్యాలయం వద్ద ఎమ్మెల్యే వెంకట్రావు మంగళవారం కన్వీనర్ల జాబితా ప్రకటించారు. మండల కన్వీనర్లు, సచివాలయ కన్వీనర్లు, పార్టీ మండల శాఖల అధ్యక్షులు, గ్రామ కమిటీ అధ్యక్షులు సమన్వయంతో గృహ సారథులను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఒక్కొక్క గ్రామ వలంటీరుకు ఇద్దరు గృహ సారథులు ఉంటారన్నారు. వారు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి అవగాహన కల్పించాలన్నారు. మండలాల వారీగా దేవరపల్లి గ్రామ సచివాలయాల కన్వీనర్‌గా కల్లేపల్లి మాణిక్యం, నల్లజర్ల కన్వీనర్‌గా నక్కా నాగసత్యనారాయణ (పండు), గోపాలపురం కన్వీనర్‌గా తానింకి సత్యనారాయణ (సత్తిబాబు), ద్వారకాతిరుమల కన్వీనర్‌గా లక్కాబత్తుల రాజును నియమించినట్టు ఎమ్మెల్యే వెంకట్రావు, పరిశీలకులు వెంకటేశ్వరరావు తెలిపారు.